VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ నవంబర్ 02 శనివారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 105

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

ఖానాపూర్ అడవుల్లో పులి సంచారం కలకలం

## బీఆర్ఎస్ కార్యకర్తలపై
# కక్షసాధింపు



కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేసి బీఆర్ఎస్ నాయకులనే జైల్లో వేశారు

విలువైన భూములను వడ్డీపావుసేరులో గుంజుసుకునే ప్రభుత్వం

లగచర్ల రైతన్నలతో కేటీఆర్ ములాఖత్

సంగారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని కావాలనే జైల్లో పెడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. లగచర్లలో అధికారులపై దాడికి పాల్పడ్డ వారిలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఉన్నారని కేటీఆర్ తెలిపారు. సంగారెడ్డి జైల్లో లగచర్ల రైతన్నలతో కేటీఆర్ శుక్రవారం ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తమ భూములు తమకే ఉండాలని లగచర్ల రైతులు పోరాడుతున్నారు. మార్కెట్‌లో

ఎకరం రూ. 70 లక్షల విలువ ఉన్న భూములను అడ్డికి పావుశేరుకు రియల్ ఎస్టేట్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గుంజేసుకుంటుందని రైతులు చెబుతున్నారు. కేవలం

మిగతా 2లో

## అరకోటికి పైగా ఇళ్లలో
# సర్వే పూర్తి



నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్


ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సమీక్ష

హైదరాబాద్:రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను దేశానికే ఆదర్శమయ్యేలా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సర్వే జరుగుతున్న తీరుపై ఆయన తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్షించారు. “నవంబరు 6వ తేదీన ప్రారంభమైన సర్వేను జాప్యం లేకుండా నిర్దేశించిన కాలపరిమితిలో పూర్తి చేయడానికి కృషి చేయాలి. మొదటి దశలో మార్కింగ్ చేసిన 1,16,14,349 ఇళ్లలో.. ఏ ఒక్క గృహాన్నీ వదలకుండా సమగ్రంగా సర్వే నిర్వహించాలి. రాష్ట్ర పౌరుల అభ్యున్నతికే ఈ వివరాల సేకరణ చేపడుతున్నాం. ఇప్పటివరకు జరిగిన సర్వేలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు సమాచారం అందుతోంది. కావాల్సిన వివరాలను చెబుతున్నారని మాకు తెలుస్తోంది. సర్వేకు ఆటంకం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దు. సర్వే జరుగుతున్న తీరును రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆటంకం లేకుండా జరిగేలా ముందస్తుగా చర్యలు తీసుకోవాలి” అని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. రాష్టంలో సర్వే జరుగుతున్న తీరు

పట్ల ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 44.1 శాతం 51,24,542 ఇళ్లలో సర్వే పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు.

ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని వారు పేర్కొన్నారు. 52,493 గ్రామీణ, 40,901 అర్బన్ బ్లాకులుగా విభజించి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించడానికి సీనియర్ ఐఏఎస్ అధికారులను ఉమ్మడి జిల్లాల వారీగా నియమించామని, క్షేత్రస్థాయిలో సీనియర్ అధికారులు కూడా పర్యటిస్తున్నారని వివరించారు. సమీక్ష సమావేశంలో సీఎస్ శాంతికుమారి, మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, ప్రణాళికాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రోజురోజుకు పెరిగిపోతున్న
# సైబర్ నేరాలు



2లో..

రాజధాని ఢిల్లీలో మరో దారుణమైన సైబర్ క్రైమ్

రిటైర్డ్ ఇంజనీర్‌ను డిజిటల్ అరెస్ట్ చేసిన నేరగాళ్ళు

రూ.10 కోట్లు కొల్లగొట్టిన స్కామర్లు

## ఉభయ తెలుగు రాష్ట్రాల్లో
# కార్తీక పౌర్ణమి శోభ

భక్తుల రాకతో ఆలయాలు కిటకిట

వేకువ జామునుంచే నదీ స్నానాలు

దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్న మహిళలు



2లో

## వరి సాగులో
# తెలంగాణ అగ్రస్థానం

7411ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



2లో..

## బిర్సాముండా పేరిట
# పోస్టల్ స్టాంపు ఆవిష్కరణ



2లో..

ఆదివాసీ మహిళ ముర్మును రాష్ట్రపతిని చేశాం

గిరిజనులకు అత్యున్నత గౌరవం ఇచ్చిన ఘనత మాదే

పీఎం జన్‌మన్ యోజన పథకం ఘనత మ్మర్మదే

బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా నివాళి

ఆదివాసీలను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్న మోడీ

## సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో
# ఫిర్యాదుల పెట్టె

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కారాలయాల్లో ఫిర్యాదులు, వినతులు సమర్పించడానికి ప్రత్యేకంగా ఫిర్యాదుల పెట్టెను తప్పనిసరిగా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీటిని రిజిస్ట్రార్ లేదా ఆపై ఉన్నతాధికారి పరిశీలించి విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లో రంగారెడ్డి జిల్లా జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1 ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకపోవడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్ కేపీహెచ్‌బీకి చెందిన పి.రమ్యశ్రీ, మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అక్టోబరు 11న ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్‌రిజిస్ట్రార్, కార్యాలయ సిబ్బంది ముడుపులు డిమాండ్ చేశారన్నారు. అధికారులు లక్ష్మణ్‌రెడ్డి, సాయిలతో పాటు దస్తావేజు లేఖరి రూ.2 లక్షలు డిమాండ్ చేశారన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు కోర్టుకు హాజరైన జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ వివరణ ఇస్తూ రిజిస్ట్రేషన్‌కు పిటిషనర్ దరఖాస్తు సమర్పించలేదని తెలిపారు.



## కాంగ్రెస్, బిఆర్ఎస్
# రెండూ ఒక్కటే

పేదల ఇళ్లు కూల్చివేతకే తాము వ్యతిరేకం

మూసీ పరివాహక ఇళ్లల్లో నేడు బిజెపి నేతల నిద్ర

రైతులకు బోనస్ ఇస్తామని..బోగస్ చేశారు

శిల్పకళావేదికలో 21 నుంచి 24 వరకు లోక్ మంథన్

మీడియా సమావేశంలో బిజెపి నేత, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



2లో..

కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా తెలంగాణ రాష్ట్రం కెసిఆర్ బాటలోనే సిఎం రేవంత్ రెడ్డి తిట్ల పురాణంతో తెలంగాణ పరువు తీస్తున్నారు పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంచర్చల వ్యవహారం..కలెక్టర్‌పై దాడి వరకు వెళ్లింది మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు...

## ఇస్రోకు ఆర్థిక మద్దతు అంతంత మాత్రంగానే..?

న్యూఢిల్లీ: చంద్రయాన్, మంగళ్‌యాన్‌లతో సామాన్యులను సైతం సైన్స్ వైపు ఆకర్షించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు ఆర్థిక మద్దతు అంతంత మాత్రంగానే ఉంది. 2014-2024 మధ్య కాలంలో మన దేశ జీడీపీకి అంతరిక్ష రంగం నుంచి 60 బిలియన్ డాలర్లు సమకూరింది. జాతీయ రోదసి దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గురువారం విడుదల చేసిన నివేదిక ప్రకారం, రోదసి రంగంలో 400కుపైగా ప్రైవేట్ కంపెనీలు ఉన్నాయి. వీటి వల్ల 6.3 బిలియన్ డాలర్ల రెవెన్యూ వస్తుండగా, 47 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. ప్రపంచంలో అతి పెద్ద రోదసి ఆర్థిక వ్యవస్థల్లో మన దేశం ఎనిమిదో స్థానంలో ఉంది. 2024నాటికి మన దేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విలువ సుమారు రూ.6,700 కోట్లు. ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ఇది 2-3 శాతం కాగా, వచ్చే దశాబ్దానికి దీనిని 10 శాతానికి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే నాసా బడ్జెట్ కన్నా ఇస్రో బడ్జెట్ 15 రెట్లు ఎక్కువ. ఇస్రోను స్థాపించి 55 ఏండ్లు అవుతున్నది. ఈ మొత్తం కాలంలో ఇస్రో పెట్టుబడులు నాసా ఒక ఏడాది బడ్జెట్ కన్నా తక్కువ. ఇస్రో ప్రస్తుత వార్షిక బడ్జెట్ సుమారు 1.6 బిలియన్ డాలర్లు కాగా, నాసా వార్షిక బడ్జెట్ 25 బిలియన్ డాలర్లు. ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఇటీవల కర్ణాటక విద్యార్థులతో మాట్లాడుతూ, అంతరిక్ష రంగంలో భాగస్వాములైన దేశాలతో ఆధిపత్యం కోసం పోరాడటం కన్నా దేశానికి సేవ చేయడంపైన మాత్రమే ఇస్రో దృష్టి సారించిందన్నారు.

## ఖానాపూర్ అడవుల్లో పులి సంచారం కలకలం

నిర్మల్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ అడవుల్లో సంచారం స్థానికంగా కలకలం రేపుతోంది. ఫారెస్ట్ అధికారులు అడవిలో ఏర్పాటు చేసిన కెమెరాల్లో పులి సంచరిస్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దీంతో ఖానాపూర్ సరిహద్దు అటవీ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. ఒంటరిగా ఎవరూ అడవిలోకి వెళ్లొద్దని, సాయంత్రం త్వరగా ఇండ్లకు చేరుకోవాలని చూసుకోవాలని సూచించారు. అటవీశాఖ అధికారుల హెచ్చరికతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెద్ద పులి ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తుందేమోనని భయపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి పులిని బంధించాలని కోరుతున్నారు.

## బిర్సాముండా పేరిట పోస్టల్ స్టాంపు ఆవిష్కరణ




పట్నా: దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఓ ఆదివాసీ మహిళకు తమ ప్రభుత్వం అత్యున్నత రాష్ట్రపతి పదవిని ఇచ్చి గౌరవించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివాసీ బిడ్డ ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిని చేయడం ఎన్డీఏ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మొదట్లో ఆ పదవికి ఆమె పేరును ప్రతిపాదించగానే ముర్మును భారీ మెజారిటీతో గెలిపించాలని బిహార్ సీఎం నితీశ్ కుమార్ దేశం మొత్తానికి పిలుపునిచ్చారని ప్రధాని గుర్తుచేసుకున్నారు. పీఎం జన్‌మన్ యోజన పథకం ద్వారా పనుల ప్రారంభ ఘనత ద్రౌపదీ ముర్ముదే అని కొనియాడారు. ఆదివాసీల కష్టాలను తీర్చేందుకు ఈ పథకం
ద్వారా రూ.24వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. బిహార్‌లో నిర్వహించిన సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఆదివాసీలు తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ధర్తీ అబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా బీహార్‌లోని జాముయ్‌లో ప్రధాని మోడీ ఆయనకు నివాళులర్పించి, ఆయన పేరిట పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. 6000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. గిరిజన సమాజాన్ని నిర్లక్ష్యం చేయడానికి గత ప్రభుత్వాలే కారణమని ప్రధాని మోడీ అన్నారు. గత ప్రభుత్వాల వల్ల గిరిజన సమాజం నిర్లక్ష్యానికి గురైందన్నారు. గిరిజన సమాజం దేశాభివృద్ధి రేసులో వెనుకబడింది. దేశ స్వాతంత్ర్యానికి ఒక పార్టీ లేదా ఒక కుటుంబం సహకరించిందని చేసే ప్రచారం తప్పన్నారు. గిరిజన సమాజంలోని ఎందరో మహానాయకులు త్యాగాలు చేశారని ప్రధాని మోడీ అన్నారు. గిరిజన సమాజం చేసిన కృషికి చరిత్రలో సముచిత స్థానం దక్కలేదన్నారు. ఏళ్ల తరబడి గిరిజన సంఘం నిర్లక్ష్యానికి గురైంది. గిరిజన సమాజం, సహకారం, త్యాగాన్ని తుడిచిపెట్టే ప్రయత్నం జరిగిందన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజనులపై ఎలాంటి శ్రద్ధ తీసుకోలేదన్నారు. వారి జీవితాల్లోని కష్టాలను తగ్గించడానికి, మా ప్రభుత్వం 24 వేల కోట్ల రూపాయలతో ప్రధానమంత్రి జన్మన్ యోజనను ప్రారంభించింది. దేశంలోని అత్యంత వెనుకబడిన గిరిజనుల ఆవాసాల అభివృద్ధికి ఈ పథకం భరోసా ఇస్తోందని అన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజనులకు మన ప్రభుత్వం వేల సంఖ్యలో శాశ్వత గృహాలను ఇచ్చిందని ప్రధాని అన్నారు. రాముడిని యువరాజును చేసింది గిరిజన సమాజమేనని ప్రధాని మోడీ అన్నారు. భారతదేశ సంస్కృతిని, స్వాతంత్ర్య పరిరక్షణ కోసం వందల ఏళ్లుగా పోరాటానికి నాయకత్వం వహించినది గిరిజన సమాజం. భారతదేశ సంస్కృతి, స్వాతంత్య పరిరక్షణ కోసం గిరిజన సమాజం వందల ఏళ్ల పాటు పోరాటాన్ని నడిపిందన్నారు. గిరిజన సమాజం ప్రకృతిని, ప్రాచీన వైద్య విధానాలను సజీవంగా ఉంచిందన్నారు. గత ప్రభుత్వాలు వెనకబడిన వర్గాల సంక్షేమం గురించి ఎప్పుడూ ఆలోచించలేదని.. వారి అభివృద్ధి కోసం కృషి చేయలేదని ప్రధాని విమర్శించారు. సమాజానికి దూరంగా నివసిస్తున్న ఆదివాసీలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. వారు పండించే దాదాపు
90 అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇచ్చామన్నారు. ఆదివాసీ యువత క్రీడలలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని.. వారిని మరింత ప్రోత్సహించడానికి అనేక క్రీడా సౌకర్యాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆదీవాసీలకు చదువు, సంపద, వైద్య సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వారి సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేశామని.. బడ్జెట్‌ను రూ.25,000 కోట్ల నుంచి రూ.1.25 లక్షల కోట్లకు పెంచామని ప్రధాని వెల్లడించారు.

# నాదొక కోరిక ఉంది..

అమరావతి: నేను రాజకీయాలకు గుడ్ బై చెప్పేస్తా.. అయితే నాదొక కోరిక ఉంది. అదొక్కటి తీరిస్తే నేను రాజకీయాలకు స్వస్తి పలికి కూర్చుంటానంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన కామెంట్స్ చేశారు. మీరు సై అంటే నేను సై సై.. అంటాను. అసలు సోషల్ మీడియా యాక్టివిస్టులపై కాదు కేసు పెట్టాల్సింది.. మీపై పెట్టాలి కేసులు. అసెంబ్లీ లో మీ తల్లిని అవమానించినట్లు నిరూపిస్తే.. నేను రాజకీయాలకు గుడ్ బై చెప్పేస్తా. మరి సిద్ధమా అంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు తాజాగా నారా లోకేష్ కు ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. ఇటీవల ఏపీలో వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులను పోలీసులు అరెస్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో హద్దులు దాటిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టకుండా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే టీడీపీ, జనసేన కార్యకర్తలు కూడా.. ఒక్కొక్కరిని వెలికితీస్తూ ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ అరెస్టులపై వైసీపీ భగ్గుమంటుండగా, టీడీపీ మాత్రం మహిళల వ్యక్తిగత హనానికి పాల్పడ్డ ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని చెబుతోంది. తాజాగా మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్ట్ పర్వంపై ఓ ట్వీట్ చేశారు. అసలు కేసులు నమోదు చేయాలంటే ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు పై ఐపీసీ 420 సెక్షన్ కింద కేసు ఎందుకు పెట్టకూడదు తెలపాలంటూ ప్రశ్నించారు. అలాగే వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఇప్పటి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు లు ఇష్టారీతిన అనుచిత వ్యాఖ్యలు చేశారని, నాడు సీఎం హెూదాలో గల జగన్ ను ఏక వచనంతో విమర్శించారన్నారు. కేసులు పెడితే ముందుగా వీరిద్దరిపైన కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని అంబటి రాంబాబు కొత్త నినాదం ట్వీట్ ద్వారా వినిపించారు. ఇక నారా లోకేష్ ఇలా చేస్తే తాను తప్పనిసరిగా రాజకీయాల నుండి తప్పుకుంటానని మాజీ మంత్రి అంబటి సవాల్ విసిరారు. శాసనసభలో తన తల్లిని అవమానించారంటూ నిన్న లోకేష్ చేసిన వ్యాఖ్యలపై అంబటి స్పందిస్తూ.. మీ తల్లిని అవమానించినటువంటి నిరూపిస్తే బేషరతుగా క్షమాపణ చెప్పి రాజకీయాలకు స్వస్తి పలుకుతానని అంబటి అన్నారు. ఇటీవల కొంత స్తబ్దతగా ఉన్న అంబటి.. ఒక్కసారిగా తన ట్వీట్లతో విరుచుకుపడడంతో, వీటికి తెలుగుదేశం పార్టీ ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

# వరి సాగులో తెలంగాణ అగ్రస్థానం

### 7411ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్: వరి సాగు ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కోటీ 53లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడితో సన్న రకాలు 25నుంచి 40లక్షల ఎకరాలకు పెరిగిందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడమే అందుకు కారణమని అన్నారు. సంక్రాంతి నుంచి రేషన్‌తో సహా అన్ని హాస్టళ్లకు సన్న బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. దొడ్డు రకం వరి సాగు 41లక్షల నుంచి 21 లక్షల ఎకరాలకు పడిపోయిందని చెప్పారు. రాష్ట్ర అవసరాలే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే అవకాశం ఉందన్నారు. 7411ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అధికారం కోల్పోయిన పార్టీ అధికారం కోసం రైతుల ఆత్మ స్థైర్యం దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. "అన్ని గ్రామ పంచాయితీల్లో కొనుగోలు కేంద్రాలు పెట్టం. వడ్లు ఆరపోసిన దగ్గర రైతులు ఆందోళన చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఆధిపత్య పోరు ఉండొచ్చు. రాష్ట్రంలో రెండో స్థానం కోసం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఆధిపత్య పోరు ఉండొచ్చు. మీ ఆధిపత్య పోరు కోసం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేయొద్దు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారమే మేము ధాన్యం కొనాలి. మీకు రైతుల మీద ప్రేమ ఉంటే గైడ్ లైన్స్ మార్చండి..కృత్రిమ ఆందోళనతో శునకానందం పొందడం సరికాదు. సబ్ కమిటీ రిపోర్ట్ వచ్చాక రైతు భరోసా ఇస్తాం. రైతులను ఇబ్బంది పెట్టే రాజకీయ క్రీడను పార్టీలు మానుకోవాలి" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కార్తీక పౌర్ణమి శోభ

హైదరాబాద్/విజయవాడ: కార్తీక పౌర్ణమి పర్వదినంతో ప్రముఖ ఆలయాలకు, నదీతీరాలకు భక్తులు పోటెత్తారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాన్నాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. సముద్ర, నదీతీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. వేకవ జామునే నదీతీర ప్రాంతాల్లో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. అటు శైవాలయాలు, ఇటు వైష్ణవాలయాలు కిటకిటలాడాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మిక శోభన సంతరించుకుంది, తెల్లవారుజాము నుంచే గోదావరి స్నానాలకు, శివాలయాలకు పోటెత్తారు భక్తులు. రాజమండ్రి పుష్కర్ ఘాట్ వద్ద గోదావరి పుణ్యస్నానా కోసం జల్లు స్నానాలను ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీక శుద్ధ పౌర్ణమి లేదా కార్తీక పున్నమి గా పిలవబడే కార్తీకమాసంలో శుక్లపక్షంలో పున్నమి తిథి దీపావళి పండగ వెళ్ళిన 15వ రోజు వస్తుంది. హిందువులు అత్యంత పరమ



పవిత్రమైన కార్తీక మాసంలోని పౌర్ణమి తిధి కావడంతో శివాలయాలకు , శైవ వక్షేత్రాలైన ద్రాక్షారామం, సామర్లకోట, పిఠాపురం పాదగయ, కోనసీమలో పలు పుణ్యక్షేత్రాలకు చేరుకుని పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు, మహాభారత కథనాన్ని అనుసరించి కార్తీకేయుడు తారకరుని సంహరించిన రోజునే కార్తీక పౌర్ణంగా పిలుస్తారని పురాణాలు చెబుతున్నాయి. మహాశివరాత్రి తర్వాత శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజుగా కార్తీకమాసం అంటారు. కార్తీక పౌర్ణమి రోజున చేసే నదీ స్నానం దీప దానం, శివాయల దర్శనం, విశేష పూజలు చేస్తే ఎంతో పుణ్యం ఫలమని నమ్మకం. ఈ నెల అంతా కార్తీక మహా పురాణాన్ని పారాయణం చేస్తారు. దేవాలయాలో కార్తీక పురాణ శ్రవణం ఏర్పాటు చేస్తే ఎంతో పుణ్యఫలం అని బ్రాహ్మణులు చెబుతున్నారు, వెయ్యిళ్ల రాక్షసుల పాలన అంతరించిన సందర్భంగా మహాశివుడు తాండవం చేశాడని పురాణాలు కూడా చెబుతున్నాయి. అందుకే కార్తీక పౌర్ణమి రోజు గోదావరి స్నానం నదీ స్నానమాచరించి శివుడికి ప్రత్యేక పూజలు చేయడానికి ఆలయాలకు క్యూ కట్టారు భక్తులు. శివాలయంలో 365 ఒత్తులతో కూడిన దీపాన్ని వెలిగిస్తే పుణ్యఫలం దక్కుతుందని నమ్మకం. దీంతో గోదావరి జిల్లాల్లోని ఆధ్యాత్మిక కేంద్రాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఇకపోతే విజయవాడ కృష్ణాఘాట్, విశాఖ బీచ్, శ్రీశైలం,శ్రీకాళహస్తి, తిరుపతిల్లో
లక్షవల్లుతు వెలగించారు. స్వామికి అభిషేకాలు చేయించారు. కాళేశ్వరం, ధర్మపురి, బాసర గోదావరి తీరాల్లో భక్తులు పోటెత్తారు. ఉదయమే భక్తులు నదీస్నానాలు ఆచరించి పూజలు చేశారు. ఉసిరి దీపాలను వెలగించారు. అమరావతిలో కృష్ణమ్మ చెంత మహిళలు తెప్పలు వదిలారు. సూర్యలంక, చీరాల, చినగంజాం, పెదగంజాం సముద్ర తీరాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు స్నానమాచ రించారు. దక్షిణ కాశీగా పేరొందిన శ్రీశైలంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్రాక్షారామం, కోటప్పకొండ, శ్రీకాళహస్తి, మహానంది తదితర పుణ్యక్షేత్రాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

# బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షసాధింపు

ఎకరం భూమి రూ. 10 లక్షలకు గుంజేసుకుంటున్నారని రైతులు బాధపడుతున్నారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా రైతులు 9 నెలలగా పోరాటం చేస్తున్నారు. లగచర్ల, హకీంపేటతో పాటు మరో రెండు తండాల ఆడబిడ్డలు రోదిస్తున్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణలో రేవంత్ రెడ్డి రాబందు మాదిరిగా వ్యవహరిస్తున్నారు. ఫార్మా కంపెనీలు కాలుష్యమని ఆయన ప్రచారం చేశారు. అదే ఫార్మాను కొడంగల్ తెస్తా.. 3 వేల ఎకరాలు రావాలని పేదల భూములు గుంజుకుంటున్నారు. దీంతో స్థానిక రైతులు మర్లబడ్డారు. 9 నెలలుగా పోరాటం చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. అధికారుల ముందు నిరసన తెలిపితే దాడుల పేరిట అరెస్టులు చేసి జైల్లో వేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇవాళ



లగచర్లలో దుర్మార్గమైన పరిస్థితి నెలకొని ఉంది. కులగణనలో పాల్గొని వచ్చిన పంచాయతీ సెక్రటరీని కూడా అరెస్టు చేసి జైల్లో వేశారు. ఆ సంఘటనలో పాల్గొనలేదు.. అయినా తనను జైల్లో వేశారని ఆ యువకుడు చెబుతున్నాడు. ఇంకో యువకుడు వనపర్తిలో చదవుకుంటున్నాడు. ఈ ఘటన గురించి తెలుసుకుని మా ఇంటి వాళ్లు ఎలా ఉన్నారో అని వస్తే నన్ను కూడా తీసుకెళ్లారని చెప్పారు. 70 మందిని అరెస్టు చేసి రెండు డీసీఎంలలో తీసుకెళ్లారని చెప్పారని కేటీఆర్ తెలిపారు. దుద్యాల మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ అనుచరులు కూడా ఈ దాడుల్లో పాల్గొన్నారు. వారి భూములు కూడా ఈ ఫార్మా విలేజ్‌లో పోతున్నాయి. రమేశ్, నర్సింహులు, రాములు అనే కాంగ్రెస్ కార్యకర్తలు కూడా దాడులు చేశారు. 70 మందిని తీసుకెళ్తే.. తిరుపతి రెడ్డి ఆదేశాల
మేరకు కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేశారట. బీఆర్ఎస్ వాళ్లు 21 మందిని రిమాండ్‌కు పంపి.. మిగతా వారిని ఇంటికి పంపించారట. కేవలం బీఆర్ఎస్ వాళ్లనే మాత్రమే జైల్లో పెట్టాలని అనుముల తిరుపతి రెడ్డి ఆదేశాలు ఇచ్చారట. ఎలాంటి పదవి లేని తిరుపతి రెడ్డికి అధికారులు, పోలీసులు మోకరిల్లుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

## నాయకుల తప్పిదంతోనే విజయవాడ మునిగింది

అమరావతి: విజయవాడ మునకకు కారణం బుడమేరు కాదు.. నాయకుల తప్పిదం అన్నారు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, పూడిక తీస్తే వరదల ప్రభావం అంతగా ఉండదు.. ఆక్రమణల కారణంగా ముంపునకు ప్రభుత్వాలు చేసే తప్పుడు పనుల వల్ల ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఏలూరు జిల్లా మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామంలో పర్యటించిన ఆయన.. కొల్లేరును పరిశీలించి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. రోడ్లు, మంచినీళ్లు, డ్రైనేజీ సమస్యలను నారాయణ దృష్టికి తీసుకువచ్చారు గ్రామస్తులు.. కాంటూరు పరిధి తగ్గించి తమకు జీవనాధారం కల్పించాలని గ్రామస్తుల విజ్ఞప్తి చేశారు.. కొల్లేరు పూడిక తీయించి నీటి పారుదల సక్రమంగా ఉండేలా చూడాలని నారాయణ దృష్టికి తీసుకు వచ్చారు గ్రామస్తులు.. పూడిక తీయకపోవడం వల్ల వరదల సమయంలో లంక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇక, ఈ సందర్భంగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. రాయలసీమలో ఎక్కడా నీళ్లు దొరకవు, మహిళలు కిలోమీటర్లు దూరం వెళ్ళి నీళ్లు తెచ్చుకుంటారు.. లంక గ్రామాల చుట్టూ నీళ్లు ఉన్నా తాగడానికి చుక్క నీళ్లు లేవు , అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా లంక గ్రామాల పరిస్థితి ఉందన్నారు.. ఆసియాలోనే అతిపెద్ద సరస్సు కొల్లేరు చేపలు పెంచుకోవచ్చు.. ఎలాంటి మందులు వాడకూడదన్నారు.. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో అప్పట్లో కొల్లేరు చెరువులు కొట్టేశారు.. సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ధిక్కరణ నోటీసులు ఇచ్చింది.. నాయకులు ప్రజల బాగు కోసం కాకుండా ఓట్ల కోసం కాంటూరు పరిధి గురించి మాట్లాడారని దుయ్యబట్టారు.. అయితే, విజయవాడ మునకకు కారణం బుడమేరు కాదు.. నాయకుల తప్పిదం, పూడిక తీస్తే వరదల ప్రభావం అంతగా ఉండదు ఆక్రమణల కారణంగా ముంపునకు ప్రభుత్వాలు చేసే తప్పుడు పనుల వల్ల ప్రజలకు ఇబ్బందులు అన్నారు. వర్షాలు, నీళ్ళు లేకపోతే బతుకే లేదు.. నీటి ప్రవాహానికి మనం అడ్డుకట్ట వేయకూడదు.. వాటి ప్రవాహాన్ని ఆక్రమనలతో అడ్డుకుంటేనే వరదలు వస్తాయన్నారు.. ముఖ్యమంత్రి చెబితే వినే అవకాశం ఇప్పుడు కేంద్రంలో ఉంది.. బుడమేరు నుంచి కొల్లేరు వరకూ పూడిక తీయాలి, లంక గ్రామాలకు రోడ్లు వేయాలని సూచించారు..మరోవైపు.. చిత్తూరు జిల్లా చంద్రగిరిలో ఎర్ర చందనం నిత్యం అక్రమంగా తరలిపోతూనే ఉంటుంది, కానీ, అటవీ శాఖ అధికారులు ఒక లారీ పట్టుకుని.. పది లారీలు వదిలేస్తారు అని ఆరోపించారు నారాయణ.. ఇక్కడ లంక గ్రామాల్లో రోడ్లు వేయాలంటే.. అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారు.. చంద్రబాబు కాదంటే కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పడిపోతుందన్నారు.. కేంద్రంలో చంద్రబాబుకి ప్రస్తుతం అంత పట్టుంది.. కేంద్రంతో మాట్లాడి సమస్యల పరిష్కారం చేయొచ్చు, పూడికలు తీయడం, ఆక్రమణలు తొలగించడం చేయాలి.. కనీస సమస్యలు లంక గ్రామాల సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ప్రధాని నరేంద్ర మోడీకి లేఖలు రాస్తాను.. కేంద్రం, రాష్ట్రం రెండూ కలిసి చేయాల్సిన పనులు ఇవి.. మేం ఓట్ల కోసం కాదు%ొ% జనం కోసం ఉంటాం 2025 ఫిబ్రవరి ఒకటో తారీకు కల్లా రోడ్లు వెయ్యకపోతే పెనుమాక లంక వెళ్లే దారిలో పోరాటం చేస్తాం.. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు .

# రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలు

న్యూఢిల్లీ: దేశంలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. సైబర్ క్రైమ్ పోలీసులు ఎంత పగడ్బందీగా చర్యలు చేపట్టినా నేరస్థులు మరింత రెచ్చిపోతున్నారు. తాజాగా దేశ రాజధాని ఢిల్లీలో మరో దారుణమైన సైబర్ క్రైమ్ వెలుగు చూసింది. 70 ఏళ్ల రిటైర్డ్ ఇంజనీర్‌ను ఎనిమిది గంటల పాటు డిజిటల్ అరెస్ట్ చేసి రూ.10.3 కోట్లు కొల్లగొట్టారు. అసలు విషయం తెలిసి బాధితుడు లబోదిబో అంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఢిల్లీలోని రోహిణి ప్రాంతానికి చెందిన 70 ఏళ్ల రిటైర్ట్ ఇంజనీర్‌ని సైబర్ నేరగాళ్లు ఎనిమిది గంటల పాటు డిజిటల్ అరెస్ట్ చేశారు. ముంబై పోలీస్ అధికారులమంటూ సైబర్ నేరగాళ్లు మొబైల్‌కు ఫోన్ చేశారు. మీ పేరు మీద డ్రగ్స్ పార్శిల్ వచ్చిందంటూ బెదిరింపులకు దిగారు. వీడియో కాల్ కోసం స్కైప్‌ని డౌన్‌లోడ్ చేయాలంటూ హడలెత్తించారు. దుండగుల సూచనలు అనుసరించిన వెంటనే.. వ్యక్తిగత సమాచారాన్ని సేకరించేశారు. అనంతరం ఎనిమిది గంటల పాటు బెదిరింపులతో చెమటలు పట్టించారు. తైవాన్ నుంచి నిషేధిత మందుల పార్శిల్ వచ్చిందని.. ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామంటూ సైబర్ నేరగాళ్లు బెదిరింపులకు దిగారు. ఒక గదిలో బంధించి మొబైల్ లేదా ల్యాప్‌టాప్ కెమెరా ముందు కూర్చోవాలని బెదిరించారు. అనంతరం మరొక గ్రూప్ ఫోన్ చేసి సాయం చేస్తామంటూ లైన్‌లోకి వచ్చి రూ.10 కోట్ల 30 లక్షల నగదును వారి ఖాతాల్లో జమ చేసుకున్నారు. నగదు చేరగానే కాల్ కట్ చేశారు. వెంటనే వివిధ ఖాతాల్లోకి నగదును నేరగాళ్లు బదిలీ చేసేసుకున్నారు. అంతా అయిపోయాక బాధితుడు లబోదిబో అంటూ భోరుమన్నాడు. భారీ మోసాన్ని గుర్తించిన బాధితుడు సహాయం కోసం పోలీసులను సంప్రదించాడు. వెంటనే కేసును సైబర్ బృందానికి ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు%ొ% రూ.60 లక్షల మొత్తాన్ని స్తంభింపజేశారు. మిగిలిన మొత్తాన్ని రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పోలీసు అధికారుల సమాచారం ప్రకారం..బాధితుడు ఒక ప్రతిష్టాత్మక కళాశాల పూర్వ విద్యార్థిగా గుర్తించారు. అలాగే అనేక కంపెనీల్లో ఉన్నత స్థానాల్లో పని చేసిన అనుభవం ఉంది. కొరియర్ పేరుతో సైబర్ నేరగాళ్లు ట్రాప్‌లోకి దింపారని వెల్లడించారు. తదుపరి విచారణ జరుగుతోందని పోలీసులు స్పష్టం చేశారు.దేశంలో సైబర్ నేరాలు పెచ్చుమీరుతున్నాయి. రోజుకో కొత్తరకం మోసాలు వెలుగు చూస్తున్నాయి. డిజిటల్ అరెస్ట్ ఇలాంటిదే. సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి.. పోలీసులమనో లేదంటే దర్యాప్తు అధికారులమనో బెదిరిస్తారు. బ్యాంకు ఖాతా, సిమ్ కార్డు, ఆధార్ కార్డు వంటివి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు వినియోగించుకున్నారని హడలెత్తిస్తారు. విచారణ పూర్తయ్యేంతవరకు అక్కడి నుంచి కదలటానికి వీల్లేదని కంట్రోల్‌లో పెట్టుకుంటారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే

హైదరాబాద్:మాజీ సిఎ కెసిఆర్ బాటలోనే.. రేవంత్‌రెడ్డి ప్రయాణిస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ ల డిఎన్ఎ ఒక్కటేనని.. రెండు పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. మాటలు, విమర్శలతో రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ లతో తెలంగాణకు ఒరిగిందేమి లేదని కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రం ఏటిఎంగా మారిందని ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మరోసారి ఫైరయ్యారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే బస్తీ దావఖానాలు నడుస్తున్నాయని ఆయన చెప్పారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఆలయాలపై దాడులు జరుగుతుంటే.. ప్రభుత్వం, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చల ద్వారా పరిష్కరించాల్సిన వ్యవహారం.. కలెక్టర్ పై దాడి వరకు వెళ్లింది. సిఎం సొంత నియోజకవర్గంలో దాడి జరగడం, రైతుల అరెస్టులు.. అసలు ఏం జరుగుతుందని సర్కార్‌ను నిలదీశారు. రైతులకు బోనస్ ఇస్తామని..బోగస్ చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీ మేరకు బోనస్ ఇచ్చే సత్తా ఈ సర్కార్ కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ హామీని నెరవేర్చడం లేదుని విమర్శించారు. తెలంగాణలో అభివృద్ధి కుంటుపడిందని.. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదన్నారు. మూసీ ప్రక్షాళనకు బిజెపి వ్యతిరేకం కాదని.. పేదల ఇండ్లు కూలగొట్టకుండానే ప్రక్షాళన చేయొచ్చని చెప్పారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా రేవంత్‌రెడ్డి మాటలున్నాయని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చురకలు అంటించారు. పేద ప్రజలకు అన్యాయం చేయొద్దని అంటే బుల్డోజర్‌లతో తొక్కిస్తా అంటావా.. తొక్కించు మేము కూడా చూస్తామని సవాల్ విసిరారు. 'సిస్టం మీకు మాత్రమే ఉందా.. మాకు లేదా.. చట్టం లేదా' అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నామని ఏది పడితే అది మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. రేవంత్ ఇలా మాట్లాడితే పేదల కోసం తాము చావడానికి కూడా సిద్ధమని అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామన్నారు. వారి కోసం తమ పదవులు త్యాగం చేసేందుకు తాము రెడీగా ఉన్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'మా ఎమ్మెల్యే , ఎంపీ పదవులు వదులుకునేందుకు రెడీ. శనివారం రాత్రి బీజేపీ అధ్వర్యంలో మూసీ బాధితుల ఇంట్లోనే ఉంటాం, అక్కడే పడుకుంటాం. మా పార్టీ ఎంపీలు , ఎమ్మెల్యేలు మూసీ , హైడ్రా బాధితుల ఇళ్లలో ఉండాలని నిర్ణయించాం.
ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తే మేము మూడు నెలలు అక్కడే ఉండేందుకు సిద్ధం. వచ్చే రోజులన్నీ బీజేపీవే. రాబోయే రోజుల్లో మీమే అధికారంలోకి రాబోతున్నం. కేటీఆర్ అరెస్ట్ అంటూ కాంగ్రెస్ డ్రామా ఆడుతుందని కిషన్‌రెడ్డి విమర్శించారు. మహారాష్ట్రలో రేవంత్‌రెడ్డి ఏ మొఖం పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని కిషన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేశామని, మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి అబద్దాలు చెబుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. మాటలు ప్రజలకు.. మూటలు పార్టీకి అన్నట్లుగా.. కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రలో ఏ ముఖం పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. అశోక్‌నగర్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇంకా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించలేదు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం చెందిందన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుచేయలేదని విమర్శించారు. హైదరాబాద్ శిల్పకళావేదికలో ఈనెల 21 నుంచి 24 వరకు లోక్ మంథన్ నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట పర్యాటక భవన్‌లో లోక్ మంథన్‌పై కేంద్రమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో ఈ ఏడాదిలో అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవంగా లోక్‌మంథన్‌ను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 21న స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 22న లోక్‌మంథన్‌ను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రారంభిస్తారని కిషన్‌రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా 24న జరిగే ముగింపు కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్ర సింగ్ షేకావత్ హాజరుకానున్నట్లు తెలిపారు.

# ఘనంగా లింబాద్రి గుట్ట జాతర.

## పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి ఘనంగా పూజలు.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 15:**

భీంగల్ మండలంలో ని లింబాద్రి గుట్ట జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం కన్నుల పండువగా సాగింది. వేలాది భక్తజనం హాజరై, లక్ష్మి నరసింహ స్వామీకి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నంబి పార్థసారథి, నంబి విజయసారథి, నంబి వాసు దేవాచార్యులు ఇతర అర్చకులు వేద మంత్రోచ్చారణల నిర్వహించారు

**భారీ బందోబస్తు.**

రథోత్సం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు సీఐ నవీన్, ఎస్సై మహేష్ అద్వర్యంలో పోలీసులు బందో బస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవంలో ప్రముఖులు పాల్గొని పూజలు నిర్వహించారు. బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, తెలంగాణ మినరల్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, బీంగల్ మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలత, సురేందర్ వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.




## విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి.

**- పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 15:**



ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. పిడిఎస్ యూ విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభను శుక్రవారం నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ, శాస్త్రీయ విద్యావిధానం కోసం దోపిడీ లేని సమాజం కోసం, విద్యారంగ సమస్యలపై పిడిఎస్ యూ విద్యార్థి సంఘం పోరాడుతుందనీ అన్నారు. పోరాటంలో అనేకమంది విద్యార్థి రత్నాలు అమరవీరులయ్యారని, త్యాగాల చరిత్ర అని, వారి పోరాట స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడాలని, ప్రతి విద్యార్థి ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. నిజామాబాద్ నగరంలో ఇంజనీరింగ్ కళాశాల, ఉమెన్స్ డిగ్రీ కళాశాల, ఇండోర్ స్టేడియం నిర్మించాలని అమరవీరుల స్ఫూర్తితో పోరాడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ నాయకులు భారత్, నితిన్, జై, రాజు తదితరులు పాల్గొన్నారు.

## 27న శ్రీ కాలభైరవ ఆర్యవైశ్య సేవా సంఘం ఎన్నికలు.

**వేగుచుక్క న్యూస్ కామారెడ్డి, నవంబర్ 15 :**




రామారెడ్డి మండల కేంద్రంలో గల ఇసన్నపల్లి శ్రీ కాలభైరవ క్షేత్రం ఆర్యవైశ్య సేవా సంఘం ఎన్నికలు ఈ నెల 27న జిల్లా సెషన్స్ జడ్జి ఆదేశాలతో నిర్వహించనున్నామని జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ప్రధాన, సహాయ కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు ఉంటాయన్నారు. ఈ నెల 20న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు నామినేషన్లు స్వీకరణ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల పరిశీలన జరుగుతుందని తెలిపారు. నామినేషన్ వేసే సభ్యులు సొసైటీ జాబితాలో సభ్యులై ఉండాలని, నామినేషన్ ఫీజు రూ.5 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. 23న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు నామినేషన్ల ఉపసంహరణ, 27న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఎన్నిక ఉంటుందని, మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు తర్వాత ఫలితాలు ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

## విద్యార్థులకు ఒంటి పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించాలి.

**- బాలల హక్కుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి.**

**వేగుచుక్క న్యూస్, హైదారాబాద్, నవంబర్ 15:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు అందరికీ కంటి పరీక్షలు, ఒంటి పరీక్షలు నిర్వహించాలని ఆన్లైన్లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ. రఘునందన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ పాఠశాలల్లో చదువుచున్న పిల్లలు ప్రత్యేకంగా కంటి చూపు, రక్తహీనత, థైరాయిడ్, డెంటల్, విటమిన్ డి లోపం, హృదయ సంబంధమైన సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. పిల్లల్లో ఉన్న ఇలాంటి ఆరోగ్య సంబంధమైన సమస్యలు ముందుగానే గుర్తిస్తే, వాటి నివారణ సులభతరం అవుతుందని వారు ప్రభుత్వానికి సూచించారు. ఆరోగ్య తెలంగాణ సాకారం అవ్వాలంటే బడి పిల్లల ఆరోగ్యం కూడా ముఖ్యమైనదని వారన్నారు. అందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులందరికీ మెడికల్ టెస్టులు చేయించి ఆయా విభాగాల వైద్యులచే చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలని, దీనికి కొనసాగింపుగా ప్రతి మూడు నెలలకు ఓ సారి సాధారణ చెకప్ చేయాలనీ వారు కోరారు.



## బహుజన లెఫ్ట్ పార్టీలో పలువురి చేరిక.

**వేగుచుక్క న్యూస్, నిర్మల్, నవంబర్ 15:**

బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్ధిరాములు సమక్షంలో పలువురు శుక్రవారం పార్టీలో చేరారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన సి.హెచ్. కళా, ఎస్ .అనుసూయ, ఎస్. అనున్ లు బహుజన లెఫ్ట్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దండి వెంకట్, ఎస్. సిద్ది రాములు మాట్లాడుతూ, తెలంగాణలో బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా పని చెస్తున్న బహుజన లెఫ్ట్ పార్టీలో చేరి, 65 శాతం ఉన్న బిసి కులాల ప్రజలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చాట్ల పోశవ్వ, నిర్మల్ జిల్లా నాయకులు వనమాల, శాంతి జాదవ్ తో పాటు బి. జగదీష్ పాల్గొన్నారు.



## నేరస్తులు అధికారంలో వస్తే ఏం జరుగుతుందో చూశాం



**2019లో దురదుష్టవశాత్తూ అదే జరిగింది క్రిమినల్స్ రాజ్యాంగాన్ని పాటించరు : పవన్‌కళ్యాణ్**

అమరావతి: నేరస్తులు అధికారంలోకి వస్తే ఏలా పాలన ఉంటుందో గత పాలనలో చూశామని ఏపీ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. దురదృష్టవశాత్తు 2019లో నేరస్తులు అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో రఘురామకృష్ణరాజు డిప్యూటీ స్పీకర్‌గా ఏకగ్రీవ ఎన్నిక సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రాజకీయాలను నేరమయం చేసిందని విమర్శించారు. నేరస్థులు అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో మొన్నటి వరకు చూశామని పేర్కొన్నారు. క్రిమినల్స్ మైంట్‌సెట్‌తో ఉన్న వ్యక్తులు అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి, రాజ్యాంగ విధానాలకు, వ్యవస్థలకు గౌరవం ఇవ్వరని విమర్శించారు. సుప్రీం కోర్టు జడ్జిలను వదలలేదు, పార్టీ కార్యకర్తలను వదలలేదని వివరించారు. సొంతపార్టీ ఎంపీని కూడా దారుణంగా హింసించిన చరిత్ర గత పాలకులదని అన్నారు. వైసీపీ పాలకులు రఘురామరాజును మానసికంగా, శారీరకంగా హింసించారని ఆరోపించారు. సొంత ఎంపీపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమైన విషయమని అన్నారు. వైసీపీ అరాచకపాలనపై వ్యతిరేకంగా ఉన్న ఓట్లు చీలనివ్వకూడదని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు.



ట్యూషన్ టీచర్ గా ప్రస్థానం ప్రారంభించిన ఆయనకు నిరుద్యోగుల కష్టాలేంటో తెలుసు. విద్యాసంస్థల నిర్వాహకుడిగా.. విద్యాసంస్థల యాజమాన్యాలకు ఉండే ఇబ్బందులేంటో తెలుసు. విద్యారంగంలో అట్టడుగు స్థాయి నుంచి ఆకాశమంత ఎత్తు ఎదిగినా.. ఆయనెప్పుడు నేల విడిచి సాము చేయలే. కరీంనగర్ కేంద్రంగా ప్రయాణం ప్రారంభించి, తెలంగాణలో రాజ్యమేలుతున్నారు. కార్పొరేట్ కాలేజీల గుత్తాధిపత్యాన్ని బద్దలుకొట్టిన మన మట్టి బిడ్డ నరేందర్ రెడ్డి. అందుకే నరేంద్రుడిని వరించడానికి విజయం ఉవ్విళ్లూరుతున్నది.

అమాసకో, పున్నానికో కనిపించే ముఖాలు, అవసరం ఉన్నప్పుడు అతి చేస్తూ తర్వాత పత్తా లేకుండా జారుకునే అవకాశవాదులకంటే సమాజం పట్ల అవగాహన, ఎల్లవేళలా అందుబాటులో ఉండే నరేందర్ రెడ్డి వంటి వారే పీఠమెక్కితే మంచిదని నిరుద్యోగులు, పట్టభద్రులు భావిస్తున్నారు. నరేందర్ రెడ్డి ఓటరుగా నమోదు కోసం విస్తృత అవగాహనతో పట్టభద్రులు గతంలో ఎన్నడూ లేని విధంగా కదలిక వచ్చింది. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీగా విద్యావేత్తను గెలిపించి, ఆల్ఫోర్స్ అధినేతకు రాజకీయంగా గుర్తింపు ఇస్తే చట్టసభల్లో కూడా గళం విప్పి సామాన్య స్టూడెంట్ కు న్యాయం జరుగుతుందనే ఉద్దేశం నమోదయిన ఓటరు జాబితాను చూస్తే అర్థం అవుతుంది. ఇటీవల కాంగ్రెస్ పార్టీ తన వ్యూహకర్త సునీల్ కనుగోలు ద్వారా నిర్వహించిన సర్వేలోనూ వీఎన్ఆర్ పేరే ప్రముఖంగా వినిపించినట్లు తెలిసింది. అందుకే నరేందర్ రెడ్డి అభ్యర్థిత్వానికే ఆయన టీమ్ సిఫార్సు చేసినట్లు పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

# ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి వైపు... పట్టభద్రుల చూపు.

- సునీల్ కనుగోలు సర్వేలోనూ వీఎన్ఆరే టాప్.
- కాంగ్రెస్ నుంచి టికెట్ కేటాయింపునకు లైన్ క్లియర్.
- ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడానికి యువత మొగ్గు.
- నరేందర్ రెడ్డి విస్తృత అవగాహనతో స్వచ్ఛందంగా ఓటరు నమోదు చేసుకున్న గ్రాడ్యుయేట్స్.
- ఉమ్మడి నాలుగు జిల్లాలో ఎక్కడ చూసినా ఆల్ఫోర్స్ అధినేత పేరే.







**వేగుచుక్క న్యూస్, ప్రతినిధి (కుంచె వెంకటేష్):**

నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల హీట్ పెరిగింది. నోటి ఫికేషన్ రాకముందే అధికార కాంగ్రెస్ పార్టీలో అనధికార చర్చ మొదలైంది. అదృష్టం ఉంటే కోరుకున్న రాజకీయ పార్టీ నుంచి టికెట్ రావచ్చు అనుకుంటారు కొందరు. కానీ అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నిక లను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఇప్పటికే ప్రచారంలో ముందు వరుసలో దూసుకుపోతున్న ప్రముఖ విద్యావేత్త డాక్టర్ బి.నరేందర్ రెడ్డికి కేటాయించేందుకు రెడీ అయింది. నరేందర్ రెడ్డి గత కొన్ని నెలలుగా ప్రచారంలోకి దిగి తమదైన శైలిలో దూసుకుపోతున్నారు. దీంతో పట్టభద్రుల మండలి పోరులో కాంగ్రెస్ పార్టీ తరపున అశావాహులలో ముందు వరుసలో నరేందర్ రెడ్డి నిలిచారు. ఇక కాంగ్రెస్ సైతం ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో గెలుపు గుర్రంగా ఉన్న ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేతగా, సామాజికవేత్తగా, సంఘసంస్కర్తగా, ప్రజాబలం కలిగిన నాయకుడు సరేబదర్ రెడ్డి వైపు చూస్తోంది.

**1.20లక్షల ఓటర్లు నమోదు**

నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా ఓటరు నమోదు కోసం కేంద్రాలు ఏర్పాటు చేసి పట్టభద్రుల ఓటు నమోదు కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వీఎస్ఆర్ ఏర్పాటు చేసిన హెల్ప్ సెంటర్ల నుంచి 1.20 లక్ష వరకు ఓటర్లు నమోదు చేసుకున్నారంటే.. ఆయనకు పట్టభద్రుల్లో ఎంత పట్టు ఉందో అర్థం చేసుకోవచ్చు.

**రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు కలిసి రానున్న అవకాశం.**

విద్యాసంస్థలు నరేందర్ రెడ్డికి రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు ఉండడం, తన స్టూడెంట్స్ పట్టభద్రులు సుమారు 40 వేలకు పైగా ఉన్నారు. దీనికితోడు నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీ నరేందర్ రెడ్డికి కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్ మెదక్ పట్టభద్రుల నుంచి కూడా మద్దతు పెరుగుతుంది. ఓటరు నమోదు అవగాహన కల్పించడంలో నరేందర్ రెడ్డి ముందు వరుసలో నిలిచారు. ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ప్రచార కార్యాలయాన్ని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ లో అందరికన్న ముందే ప్రారంభించారు. ఏ పార్టీ వారు టికెట్ ఇచ్చిన ఇవ్వకపోయినా ఇండిపెండెంట్ గా నైనా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించడంతో అధిష్టానం అలాంటి వ్యక్తిని ముందే పార్టీ టికెట్ ఇచ్చి ప్రకటిస్తే 100% విజయం సాధిస్తాడని నిర్ధారణకు వచ్చినట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ టికెట్ నరేందర్ రెడ్డికి వస్తుందనేది దాదాపు ఖరారు అయింది అన్న ప్రచారం జరుగుతుంది.

**2018లోనే కాంగ్రెస్ లో చేరిక.**

కాంగ్రెస్ పార్టీ తరపున కరీంనగర్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి పోటీ చేయాలని భావించిన సరేందర్ రెడ్డి 2018లో ప్రస్తుత రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో పార్టీలో చేరారు. అయితే ఆ ఎన్నికల్లో పొన్నం ప్రభాకర్ పోటీ చేయడం. తనకు టికెట్ రాకపోవడంతో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండి, విద్యాసంస్థల విస్తరణ మీద పూర్తిగా దృష్టి సారించారు. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల సమయంలోనూ ఆయన పోటీచేస్తారనే ప్రచారం జరిగింది. కానీ ప్రచారాన్ని ఆయన అప్పట్లో కొట్టిపారేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెలి జీవన్ రెడ్డి, మరికొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సన్నిహిత సంబంధాలు కలిగిన నరేందర్ రెడ్డి వారికి తన మనసులో మాట చెప్పడంతో వారు గో హెడ్ అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో నాలుగు జిల్లాలను ఇప్పటికే పలుమార్లు చుట్టేశారు. గ్రాడ్యుయేట్ ఎన్ రోల్ మెంట్ లో లక్షన్నరకు పైగా గ్రాడ్యుయేట్లను వీఎస్ఆర్ టీమ్ లే నమోదు చేయించడం విశేషం. నాలుగు జిల్లాల్లోనూ నరేందర్ రెడ్డి పేరు చూపుతున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ టికెట్ లభిస్తే వంద శాతం విజయం తధ్యం అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.











# పుష్ప.2 భారీ ప్రమోషనల్ ప్లాన్ రెడీ



టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ కాంపౌండ్ నుంచి వస్తోన్న ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీని 2024 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారని తెలిసిందే. ఈ నేపథ్యంలో భారీ ప్రమోషనల్ ప్లాన్ రెడీ చేశారు. ఈ నెల 17న పాట్నాలోని గాంధీ మైదాన్ సాయంత్రం 5 గంటల నుంచి పుష్ప ది రూల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త పోస్టర్ షేర్ చేశారు మేకర్స్. మొత్తానికి పుష్పరాజ్ మేనియా ఈ సారి గట్టిగానే ఉండబోతుందని తాజా పోస్టర్ చెప్పకనే చెబుతోంది. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# కడపకు వెళ్లనున్న రాంచరణ్.. కారణమిదే..!



టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ ప్రస్తుతం గేమ్ ఛేంజర్ సినిమాతో ఫుల్ బిజీగా ఉన్నాడని తెలిసిందే. పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లోస్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం 2025 జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇప్పటికే ప్రమోషనల్ ప్లాన్‌తో ఫుల్ బిజీగా ఉంది గేమ్ ఛేంజర్ టీం. కాగా రాంచరణ్ ప్రఖ్యాతి గాంచిన ఏపీలోని కడప దర్గాను సందర్శించనున్నాడు. తాజా సమాచారం ప్రకారం నవంబర్ 18న జరుగనున్న 80వ దర్గా నేషనల్ ముషైరా ఘజల్ ఈవెంట్‌కు రాంచరణ్ ముఖ్యఅతిథిగా హాజరుకాబోతున్నాడు. ఈవెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలపై త్వరలోనే క్లారిటీ రానుందని టాక్. మరోవైపు రాంచరణ్ ఉప్పెన డైరెక్టర్ బుచ్చిబాబు సానతో చేయబోయే ఆర్‌సీ 16 షూటింగ్‌లో జాయిన్ కావాల్సి ఉంది. ఆర్‌సీ 16 మైసూర్ షెడ్యూల్‌కు సంబంధించిన కొత్త అప్‌డేట్ రావాల్సి ఉంది. గేమ్ ఛేంజర్‌లో బాలీవుడ్ భామ కియారా అద్వానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాజోలు సుందరి అంజలి, నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# బ్రేకప్ వల్ల డిప్రేషన్‌లోకి వెళ్లిపోయా : రాశీఖన్నా

కెరీర్ ఆరంభంలో దక్షిణాదిలో ఓ వెలుగువెలిగింది పంజాబీ భామ రాశీఖన్నా. 'థాంక్యూ' సినిమా తర్వాత టాలీవుడ్‌లో కాస్త బ్రేక్ తీసుకున్న ఈ అమ్మడు ప్రస్తుతం 'తెలుసు కదా' అనే చిత్రంలో నటిస్తున్నది. హిందీలో ఆమె నటించిన 'ది సబర్మతీ రిపోర్ట్' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. గుజరాత్ గోద్రా రైలు దహనం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా ప్రమోషన్‌లో తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది రాశీఖన్నా. గతంలో తాను ప్రేమలో ఉన్నానని, అనుకోని కారణాల వల్ల బ్రేకప్ అయిందని తన విఫల ప్రేమను తలచుకొని భావోద్వేగానికి గురైంది. రాశీఖన్నా మాట్లాడుతూ 'నేను చాలా సున్నిత మనస్కురాలిని. కొన్నేళ్ల క్రిందట ఓ వ్యక్తిని గాఢంగా ప్రేమించాను. కానీ దురదృష్టవశాత్తు మేమిద్దరం విడిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో చాలా బాధపడ్డాను. కొన్ని నెలల పాటు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. ఆ తర్వాత ధైర్యాన్ని కూడగట్టుకొని కెరీర్ మీద దృష్టి పెట్టాను. నా శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యుల మద్దతు వల్ల ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడ్డా' అని చెప్పింది. అ యితే తనతో ప్రేమాయణం నడిపిన వ్యక్తి గురించి ఎలాంటి వివరాలను వెల్లడించలేదు రాశీఖన్నా. దాంతో సదరు వ్యక్తి ఎవరోనని అభిమానులు ఆరా తీస్తున్నారు. రంజన్ చందేల్ దర్శకత్వం వహించిన 'ది సబర్మతీ రిపోర్ట్' ఈ నెల 15న విడుదల కానుంది.

## అమిర్‌ఖాన్‌ను కలవనున్న దిల్‌రాజ్‌భారీ ప్రాజెక్టుకు ప్లాన్



టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ దిల్ రాజు హిందీలో పలు సినిమాలు తెరకెక్కించాడని తెలిసిందే. అంతేకాదు ఇటీవలే బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్‌ను కలిసి ఓ ప్రాజెక్ట్ చేసే విషయమై చర్చించినట్టు వార్తలు తెరపైకి వచ్చాయి. టాలీవుడ్ లీడింగ్ డైరెక్టర్ వంశీపైడిపల్లి ఈ సినిమాకు దర్శకత్వం వహించబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. కాగా వంశీపైడిపల్లి ఇటీవలే అమీర్ ఖాన్‌కు సినిమా లైన్‌ను వినిపించగా.. ఎక్జయిట్ అయిన అమీర్ ఖాన్ పూర్తి స్క్రిప్ట్‌తో రావాలని సూచించాడట. తాజాగా దీనికి సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. వంశీపైడిపల్లి స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేశాడని.. త్వరలోనే దిల్ రాజుతో కలిసి ముంబైలో అమీర్‌ఖాన్‌ను కలువబోతున్నాడని బీటౌన్ సర్కిల్‌తోపాటు టాలీవుడ్‌లో వార్త ఒకటి హల్ చల్ చేస్తోంది. ఒకవేళ ఈ ప్రాజెక్టు ఒకే అయితే మాత్రం దిల్ రాజు హోం బ్యానర్‌లో వంశీపైడిపల్లి– అమీర్ ఖాన్ కాంబోలో రాబోయే భారీ డీల్ అని చెప్పక తప్పదు. మరి ఈ క్రేజీ ప్రాజెక్టుపై రాబోయే రోజుల్లో అధికారిక ప్రకటన ఏదైనా వస్తుందేమో చూడాలంటున్నారు సినీ జనాలు. ఇంతకీ దిల్ రాజు ఎలాంటి సినిమా ప్లాన్ చేశాడోనని ఇండస్ట్రీ సర్కిల్‌లో ఆసక్తికర చర్చ నడుస్తోంది.

# నా దగ్గర ఆరు స్క్రిప్టులున్నాయి : డైరెక్టర్ శివ



కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శివ కాంపౌండ్ నుంచి వచ్చిన చిత్రం కంగువ. పీరియాడిక్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రంలో సూర్య టైటిల్ రోల్‌లో నటించగా.. బాలీవుడ్ భామ దిశాపటానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. బాబీ డియోల్ కీలక పాత్ర పోషించిన ఈ మూవీ తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదలైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మిక్స్ డ్ టాక్ తెచ్చుకుంటోంది. కాగా ఇదిలా ఉంటే ప్రమోషనల్ ఇంటర్వ్యూలో శివ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. రాబోయే రోజుల్లో భారీ ప్రాజెక్టులను నిర్మించే ప్లాన్ చేస్తున్నట్టు చేస్తున్నట్టు చెప్పాడు. కంగువలా ఔట్ ఆఫ్ ది బాక్స్ కాన్సెప్ట్‌తో ఐదు నుంచి ఆరు స్క్రిప్టులు నా దగ్గరున్నాయి. అవన్నీ డిఫరెంట్ జోనర్‌లో ఆసక్తికర నేపథ్యాలుంఅయి. దేవుడి ఆశీస్సులతో ఆ సినిమాలు చేస్తానని క్లారిటీ ఇచ్చాడు శివ. ఒకవేళ కంగువ అన్ని భాషల్లో బాగా వర్కవుట్ అయితే.. అది శివ ఇతర ఇండస్ట్రీల యాక్టర్లలో సినిమాలు చేసేందుకు ఉపయోగపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. స్టూడియో గ్రీన్–యూవీ క్రియేషన్స్ బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కిన కంగువ ఫ్రెంచ్, స్పానిష్, ఇంగ్లీష్ సహా ఎనిమిది భాషల్లో గ్రాండ్‌గా విడుదలైంది. ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు. కంగువ చిత్రాన్ని నైజాం ఏరియాలో పాపులర్ టాలీవుడ్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేయగా.. ఓవర్సీస్ విషయానికొస్తే నార్త్ అమెరికాలో, యూకేలో యశ్ రాజ్ ఫిలిమ్స్ , సింగపూర్‌లో హోం స్క్రీన్, గల్ఫ్ దేశాల్లో రిలీజ్ చేశాయి. కంగువ బాక్సాఫీస్ కలెక్షన్లు ఎలా ఉండబోతున్నాయన్నది తెలియాల్సి ఉంది.

# రౌడీ బాయ్.. శ్రీలీలతో భారీ కాంబినేషన్ వీడి.12తో ప్రేక్షకుల ముందుకు..?

రౌడీ బాయ్ 'విజయ్ దేవరకొండ' హీరోగా గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న సినిమా 'వీడి12'. ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోంది. 2025 సమ్మర్‌లో రిలీజ్ కానున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే రిలీజైన ఓ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ లుక్ అందరిని తెగ ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలోనే మూవీ టీమ్ అప్డేట్స్‌తో హైప్ క్రియేట్ చేయాలనీ భావిస్తోంది. అయితే ఈ చిత్ర మేకర్స్ చేసిన ప్లాన్‌కి మీ మైండ్ బ్లైండ్ కావాల్సిందే. ఇంతకీ ఈ మూవీ మేకర్స్ ఎం ప్లాన్ చేశారంటే.. ఈ సినిమా టైటిల్ కూడా ఇంకా రివీల్ కాకపోవడంతో మేకర్స్ టైటిల్ టీజర్‌ని విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ టీజర్‌కి గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణని వాయిస్ ఓవర్ ఇచ్చేందుకు సంప్రదించారట మేకర్స్. దీనికి ఆయన కూడా సానుకూలంగా స్పందించారట. దీంతో రౌడీ బాయ్ ప్లస్ గాడ్ ఆఫ్ మాసెస్ కాంబినేషన్‌లో టీజర్ ఊహించుకుంటేనే గూస్ బంప్స్ వస్తున్నాయి అంటున్నారు ఫ్యాన్స్. 'మళ్ళీ రావా', 'జెర్సీ' వంటి సినిమాలతో ఫీల్ గుడ్ ఎమోషనల్ సినిమాలు అందించిన గౌతమ్ తిన్ననూరి ఈ సారి యాక్షన్ జోనర్ లోకి షిఫ్ట్ అయ్యాడు. ఈ సినిమా పోస్టర్ చూస్తేనే తెలిసిపోతుంది. ఇక విజయ్ దేవరకొండ కూడా ఈ సినిమాపై ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నాడు. ఇది మంచి కంబ్యాక్ ఫిల్మ్ కాబోతుందని విశ్లేషకుల మాట. ఈ గ్యాప్‌లో గౌతమ్ మరో చిన్న ప్రాజెక్ట్ తో థియేటర్ల ముందుకి రానున్నాడు. నూతన నటీనటులతో 'మ్యూజిక్' అనే సరికొత్త చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ చివర్లో తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. కానీ.. వాయిదా పడే అవకాశాలు ఉన్నాయి.

